
సాక్షి
నిజామాబాద్

సోమవారం। 11। డిసెంబర్। 2023



ప్రభుత్వం అంగీకరిస్తేనే..!
ప్రభుత్వం అంగీకరిస్తేనే పంచాయతీ ఎన్నికలు సాధ్యమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- 8లో ▸



అథ్లెటిక్స్ టోర్నీ ప్రారంభం
జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /16.7

వాతావరణం
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

సుభాష్‌నగర్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా పడిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రస్తుతం యథావిధిగా ప్రతి సోమవారం కొనసాగిస్తామన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

364 మందికి ఐపీ నోటీసులు

- డిచ్‌పల్లిలో వ్యాపారి కుచ్చుటోపి
- రూ. 15 కోట్లకు ఎసరు

నిజామాబాద్ రూరల్ : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని విత్తనాల దుకాణం, సిమెంట్ దందా చేసే వ్యాపారి రూ.15 కోట్లకు ఐపీ పెట్టాడు. వ్యాపారంలో నష్టపోయి ఐపీ పెట్టినట్లు సమాచారం. వ్యాపారి డిచ్‌పల్లిలో కొన్నేళ్లుగా వివిధ వ్యాపారాలు చేస్తుండటంతో ఆయనను నమ్మిన కొంతమంది డబ్బులు ఇచ్చారు. కాగా సదరు వ్యాపారి ఐపీ పెట్టడంతో సుమారు 364 మంది నోటీసులు అందుకున్నట్లు తెలిసింది. ఇందులో ఎక్కువ మంది రైతులు ఉండటం గమనార్హం. పంటలు పండించిన డబ్బులను వ్యాపారిని నమ్మి ఇస్తే ఐపీ పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్కరు రూ. 5 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అప్పులు ఇచ్చారు. డబ్బులు ఇవ్వకుండా వ్యాపారి ఐపీ పెట్టడంతో బాధితులు బోరుమన్నారు. వ్యాపారి కుమారుడు ఇంజినీర్ చదివి బిల్డర్‌గా అవతారమెత్తాడు. స్థానిక మండలకేంద్రంలో ఓ కల్యాణ మండపాన్ని అద్దెకు తీసుకుని నడుపుతున్నట్లు సమాచారం. రూ. కోట్ల ఆస్తులు ఉన్న వ్యాపారి రూ. 15 కోట్లకు ఐపీ పెట్టడంతో ఏం జరుగుతుందోనని మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. నోటీసులు అందుకున్న వారిలో సదురు వ్యాపారి బంధువులు కూడా ఉన్నారు. బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. 1,518 మంది విద్యార్థులకు గాను 1,458 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

సీఆర్పీల ఆడిట్ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ



కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర సీఆర్పీల సంఘం ఆర్థిక పరిపాలన ఆడిట్ కమిటీ చైర్మన్‌గా లింగంపేట మండలానికి చెందిన సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం కామారెడ్డిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రాజన్న సన్నిధిలో రూరల్ ఎమ్మెల్యే



వేములవాడ : వేములవాడ రాజన్నను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. కుటుంబ సమేతంగా ఆయన రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు.

డబుల్ ఇళ్లలోకి ప్రజలు..?



నిజామాబాద్ నాగారం : నగరంలోని నాగారం శివారులోని డబుల్ బెడ్ రూం సముదాయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. కాని లబ్ధిదారులకు అందించలేదు. అకస్మాత్తుగా ఆదివారం రాత్రి కొంత మంది వ్యక్తులు ఆ డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి వెళ్లినట్లు సమాచారం.

ప్రజాప్రతినిధులైతే..
వదిలేస్తారా..?

- ఓ ప్రజాప్రతినిధి వ్యాపార సముదాయంలో రూ. కోట్లల్లో విద్యుత్ బకాయిలు
- ఆవైపు కన్నెత్తి చూడని విద్యుత్‌శాఖ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- విద్యుత్ శాఖలో వింతధోరణి

సామాన్యులు ఒకనెల కరెంటు బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే అపరాధ రుసుం వేసి బెదరగొట్టి వసూలు చేసే ట్రాన్స్‌కో అధికారులు ఆర్మూర్‌లో ఓ మాజీ ప్రజాప్రతినిధి రూ. కోట్లల్లో విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా కిమ్మనకుండా గప్‌చుప్‌గా చూస్తూ ఉండిపోయారు. ఇదేం ధోరణి అంటూ సామాన్యులు విద్యుత్ శాఖపై ఆగ్రహంతో ఉన్నారు.

నిజామాబాద్ నాగారం: సామాన్యులు ఎవరైనా రెండు నెలలు కరెంటు బిల్లు కట్టకపోతే ఇంటిముందు హంగామా చేసే విద్యుత్ శాఖ అధికారులు ఓ మాజీ ప్రజాప్రతినిధి ఏడాదిగా తన వ్యాపార సముదాయానికి రూ. కోట్లల్లో కరెంటు బిల్ కట్టకపోయినా నిమ్మకు నీరెత్తినట్లు గప్‌చుప్‌గా ఉండిపోయారు.

ఆర్మూర్ పట్టణంలో..

జిల్లాలోని ఆర్మూర్ నడిబొడ్డున బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి చెందిన జీవన్‌రెడ్డి మాల్‌కు సంబంధించి విద్యుత్ బిల్లులు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. 2022లో దసరా రోజు ఈ మాల్ ప్రారంభమైంది. ఏడాదికిపైగా రూ. 2.57 కోట్లకు పైగా బిల్లు పెండింగ్‌లో ఉంది. ప్రజాప్రతినిధికి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ కావడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రతినెలా లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో పెరిగిపోతున్నా పట్టించుకోలేదు. వీటితోపాటు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బిల్లులు కోట్లలో పెండింగ్‌లో ఉంటున్నాయి.

ప్రభుత్వం మారగానే..

అర్మూర్‌లోని మాజీ ప్రజాప్రతినిధికి చెందిన షాపింగ్ మాల్ ఏడాదిన్నరగా వెళ్లకుండా ప్రభుత్వం మారగానే.. మాల్‌కు కరెంట్‌కట్ చేసి గొప్పలు చెప్పుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ పని ముందే చేయాల్సి ఉండేదని అభిప్రాయపడుతున్నారు.



ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్

ఉన్నతాధికారి ఆగ్రహించినా..

విద్యుత్ సీఎండీ గోపాల్‌రావు జిల్లాలో పెండింగ్ బిల్లుల విషయంలో జిల్లా అధికారులపై సమీక్షల్లో, ఫోన్లలో అనేకసార్లు ఆగ్రహం వ్యక్తం చేసేవారు. జిల్లాస్థాయి అధికారులు తమ కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు నేరుగా సామాన్యుల ఇళ్లకు వెళ్లి జులూం చేసేవారు. రూ. 500 కట్టకున్నా కరెంట్ పీకేసేవారు. సామాన్యులు భయపడుతూ మరీ కార్యాలయానికి వెళ్లి బిల్లులు కట్టేవారు. అలాంటిది ఓ మాజీ ప్రజాప్రతినిధి రూ. కోట్లల్లో విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పేదలపై ప్రతాపం సరికాదు

పేదలు రెన్నెళ్ల బిల్లులు చెల్లించకుంటే విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ కరెంట్‌కట్ చేస్తున్నారు. కేవలం రూ. వందల్లో పెండింగ్ ఉన్నా సరే..బిల్లులు కట్టమని ఒత్తిడి తెస్తున్నారు. నానా కష్టాలు పడి మరీ బిల్లులు చెల్లిస్తున్నారు. అందరికీ ఒకే నియమం ఉండాలి. ఇది సరైన పద్ధతి కాదు.

– కృష్ణ, సుభాష్‌నగర్

ఒకేన్యాయం ఉండాలి

విద్యుత్ బిల్లుల చెల్లింపుల విషయంలో అందరికి ఒకే న్యాయం ఉండాలి. కరెంట్ బిల్లులు ప్రతి నెలా ఇస్తున్నారు. ఎవరు బిల్లు కట్టకున్నా కరెంట్ కట్ చేస్తున్నారు. అదే విధంగా పెద్ద, చిన్న, ప్రజాప్రతినిధులు అని తేడాలేకుండా అందిరికీ ఒకేన్యాయం చేయాలి. పక్షపాత ధోరణి అవలంభించడం సరికాదు.

– రాజేశ్, చంద్రశేఖర్ కాలనీ

యాసంగి నీటి విడుదల ఎప్పుడో?

- ఇంకా ఖరారు కాని నీటి విడుదల షెడ్యూల్
- ఎస్సారెస్పీలో 78 టీఎంసీల నీటినిల్వ
- ఆలస్యంగా వదిలితే వేసవిలో ఇబ్బందిగా మారుతుందంటున్న రైతులు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగిలో కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టడం సందిగ్ధత నెలకొంది. ఆయకట్టుకు నీటి విడుదలపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాని షెడ్యుల్ ఇప్పటి వరకు ఖరారు కాలేదు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది కంటే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 9 టీఎంసీల నీరు తక్కువగా ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్ట్‌లో 87 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 15 నుంచి ఆయకట్టుకు నీటి సరఫరా చేస్తారు. డిసెంబర్ 15 నుంచి మార్చి 31 వరకు నీటి విడుదల చేస్తారు. దీంతో 100 నుంచి 110 రోజుల్లో చేతికందే వరి వంగడాలను రైతులు సాగుచేస్తున్నారు. కాని ప్రస్తుత ఏడాది జనవరి 1 నుంచి నీటి విడుదల చేసే అవకాశం ఉన్నట్లు ముందుగా అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాని ఆలస్యంగా నీటి విడుదల చేస్తే వేసవిలో పంటలకు నీరు అందడం గగనమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి 1 నుంచి నీటి విడుదల చేస్తే చేపడితే ఏప్రిల్ 15 వరకు నీటి విడుదల చేపట్టాల్సి ఉంటుంది. వేసవిలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వడగండ్ల వర్షాలు కురిసే ప్రమాదం కూడా ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని గతంలో మార్చి 31 వరకు నీటి విడుదల చేపట్టేలా ప్రాజెక్ట్ ఉన్నత అధికారులు నీటి విడుదల షెడ్యూల్ చేపట్టారు. కాని ప్రస్తుత ఏడాది నీటి విడుదలపై మల్లగుల్లాలు పడ్తున్నారు.

ప్రాజెక్ట్‌లో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అందులో 5 టీఎంసీల నీరు డెడ్ స్టోరేజీ, 5 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, మరో 5 టీఎంసీలు ఆవిరి రూపంలో పోతుంది. ఈ లెక్కన 78 టీఎంసీల నుంచి 15 టీఎంసీల నీరు పోగా మిగిలేది 63 టీఎంసీల నీరే.. గతేడాది యాసంగి సీజన్‌కు 60 టీఎంసీల నీటిని కేటాయించారు. ప్రస్తుతం కూడా లెక్కల ప్రకారం యాసంగి సీజన్‌కు సరిపడా నీరు ఉండగా మరో 3 టీఎంసీల నీరు అదనంగా ఉంటుంది. అయినా ప్రాజెక్ట్ అధికారులు గతేడాది కంటే ప్రస్తుతం నీరు నిల్వ తక్కువ ఉందని జనవరి 1 నుంచి నీటి విడుదల చేపట్టే అవకాశం ఉన్నట్లు అభిప్రాయం వ్యక్తం చేయడంపై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి పారుదల ఉన్నత అధికారులు స్పందించి నీటి విడుదల షెడ్యుల్‌పై వెంటనే నిర్ణయం చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటి మట్టం

రైస్‌మిల్లుపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి





రైస్ మిల్లులో దాచిన బియ్యం, డీసీఎం వద్ద టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సిబ్బంది

ఎడపల్లి (బోధన్) : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఎడపల్లి శివారులో ఓ రైస్‌మిల్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి మెరుపుదాడి చేశారు. ఈ రైస్ మిల్లులో భారీమొత్తంలో పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. ఈ దాడుల్లో ట్రాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐ అంజయ్యతో పాటు సిబ్బంది ఉన్నారు. ఈ రైస్‌మిల్‌లో వ్యాన్‌లో 100 టన్నుల వరకు పీడీఎస్ బియ్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు 20 టన్నుల వరకు పాలిషింగ్ బియ్యం ఉన్నట్లు సమాచారం. సివిల్ సప్లై అధికారులకు వీటిని అప్పగించారు. పీడీఎస్ బియ్యంను పాలిషింగ్ చేసి మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు.

అల్పాహారం ఆరంభ శూరత్వమేనా?

- కొన్ని పాఠశాలల్లోనే పథకం ప్రారంభం
- అక్టోబర్ 6న ప్రారంభించి తర్వాత విస్తరించని వైనం
- కొత్త ప్రభుత్వమైనా పథకంపై దృష్టి పెట్టాలని వినతి

మోర్తాడ్(బాల్కొండ) : దసరా సెలవులకు ముందుగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ లాంఛనంగా కొన్ని పాఠశాలల్లో ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ఆరంభ శూరత్వంగానే మిగిలిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో అల్పాహారం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని గత ప్రభుత్వం వెల్లడించింది. అల్పాహారం పథకానికి సంబంధించి సరైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అక్టోబర్ 6న గత ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక్కో స్కూల్‌లో ప్రారంభించి చేతులు దులుపుకుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దసరా సెలవులు ముగిసిన తర్వాత అన్ని పాఠశాలలకు విస్తరించాల్సి ఉండగా నిధుల కేటాయింపు, సామగ్రి కొనుగోలు, మధ్యాహ్న భోజన మేజెన్సీలకు బిల్లులు, గౌరవ వేతనం చెల్లించకపోవడంతో అల్పాహారం కొన్ని పాఠశాలలకే పరిమితమైంది. జిల్లాలో 764 ప్రాథమిక, 145 ప్రాథమికోన్నత, 270 ఉన్నత పాఠశాలలు ఉండగా 1,17,147 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో కేవలం పదుల సంఖ్యలోని పాఠశాలల్లోనే అల్పాహారం కార్యక్రమం కొనసాగుతుంది. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.10 చొప్పున బిల్లును చెల్లిస్తున్నారు. ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది.



వేల్పూర్ ఉన్నత పాఠశాలలో మంత్రి హోదాలో అల్పాహారం అందజేస్తున్న ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

ఖద్దరు గుండెల్లో కలవరం!

- నాయకులను వెన్నాడుతున్న హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లు
- రాజకీయంలో తీరిక లేక.. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న వైనం
- అనుకున్న లక్ష్యం చేరుకోలేక, అప్పుల పాలై..
- చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్న నేతలు



సాక్షి, కామారెడ్డి: పదవుల మీద వ్యామోహంతో రాజకీయాల్లో అడుగుపెట్టిన వాళ్లలో చాలా మంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో బీపీ, షుగర్ వంటి సమస్యలతో సతమతమవుతూ హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లకు గురవుతున్నారు. అలాంటి వారిలో కొందరు సమయానికి వైద్యం అంది ప్రాణాలతో బయట పడుతుండగా, మరికొందరు తనువు చాలిస్తున్నారు. కాలం కలిసిరాక పదవులు దరిచేరలేదనే వేదనకు గురై కొందరు, దర్పం కోసం అడ్డగోలు ఖర్చులు చేసి అప్పులపాలై అవస్థలు పడి మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. చాలా మంది నాయకులు, ప్రజాప్రతినిధులు బీపీ, షుగర్ లెవల్స్ పెరిగిపోయి హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లకు గురవుతున్నారు. ఒక్కోసారి తీవ్ర ఒత్తిడితో గుండె నాళాల్లో రక్తప్రసరణ నిలిచిపోయి, బ్రెయిన్‌లో నరాలు చిట్లిపోయి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. రాజకీయంగా ఎదిగినవారే కాకుండా ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. మెజారిటీ ప్రజాప్రతినిధులు, నాయకుల్లో బీపీ, షుగర్ సమస్య కామన్‌గా కనబడుతోంది. ట్యాబెట్స్ వాడే వాళ్లు కొందరైతే, ఇన్సులిన్ తీసుకుంటున్నవారూ కొందరున్నారు. బీపీ, షుగర్‌ను కంట్రోల్ చేసుకునేందుకు కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు నిత్యం వ్యాయామం, యోగా చేస్తుండగా, ఇంకొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా ఏదైనా సమస్య ఎదురైనపుడు తీవ్ర ఒత్తిడికి గురై హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లు వచ్చి తనువు చాలిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఈగ గంగారెడ్డి తనకు ఏదైనా నామినేటెడ్ పదవి వస్తుందేమోనని ఆశపడ్డారు. ఏదీ దక్కలేదు. నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మానసిక వేదనతో పక్షవాతానికి గురై ఆస్పత్రిపాలయ్యారు. అదృష్టం కొద్దీ బయటపడినా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేకపోయారు.

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డికి ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత జెడ్పీ వైస్ చైర్మన్ పదవి రావాలి. కానీ పదవి రాకపోవడంతో ఆయన మనోవేదనకు గురవగా, గుండె నాళాలు బ్లాక్ అయ్యాయి. సమయానికి ఆస్పత్రికి వెళ్లడంతో స్టంట్‌లు వేశారు. దీంతో కోలుకున్నాడు. భిక్కనూరు జెడ్పీటీసీ సభ్యురాలి భర్త, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భిక్కనూరులో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న హన్మంత్ రెడ్డి ఇటీవల కిడ్నీ సమస్యతో ఆస్పత్రిపాలై చికిత్స పొందుతున్నారు.భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాణాల అమృతరెడ్డి కిడ్నీలు దెబ్బతినడంతో ఆయన భార్య కిడ్నీ ఇవ్వగా కోలుకున్నారు. ఇక్కడే మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన చిట్టెడి భగవంతరెడ్డి రెండున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో తిరిగి ఆర్థికంగా చితికిపోయి అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే..

రాజకీయాల్లోకి వచ్చిన వాళ్లలో కొందరు అవకాశాలు అందిపుచ్చుకుని తక్కువ కాలంలో ఎదుగుతున్నారు. వాళ్లను చూసి తాము కూడా స్థాయికి మించిన ఆలోచనలు చేస్తున్నారు. కొందరు దశాబ్దాలు కష్టపడినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. అలాగని అందరిదీ అదే పరిస్థితి అని కాదు. కానీ కొందరు ఒక్కసారిగా ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఆరాటంతో అడ్డగోలుగా ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. తాము పెట్టుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆందోళనకు గురై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. అత్యాశకు పోకుండా, స్థాయికి మించి ఆలోచనలు చేయకుండా ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం, మెడిటేషన్, యోగా, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రాణాలు కోల్పోయిన వారెందరో..

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలువురు నాయకులు హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌లతో ప్రాణాలు కోల్పోయారు. కామారెడ్డి జిల్లాలో అయితే గ్రామ, మండల స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా పనిచేసిన వాళ్లు పలువురు ప్రాణాలు కోల్పోయారు. గాంధారి మండలం గౌరారం సర్పంచ్‌గా పనిచేసిన మహేందర్ రెండేళ్ల కింద గుండెపోటుతో చనిపోయాడు. ఇటీవల జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ సంపత్‌రెడ్డి గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. కొంత కాలం కిందటే ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ గుండెపోటుతో చనిపోయారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పనిచేసిన పాలమూరు జిల్లాకు చెందిన గాయకుడు సాయిచంద్ ఇటీవల గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు.

ఉత్తరాలు పోస్టుమన్ ఇంట్లోనే..

- ఆర్నెళ్లుగా బట్వాడా చేయని వైనం
- చర్యలకోసం ఉన్నతాధికారులకు నివేదిక

నిజామాబాద్ సిటీ : ప్రజలకు ఉత్తరాలు బట్వాడా చేయకుండా ఓ పోస్ట్‌మన్ ఆర్నెళ్లుగా ఉత్తరాలను తన ఇంట్లోనే పెట్టుకున్నాడు. దీంతో ఉత్తరాలు అందనివారు ఆరాతీస్తే అసలు విషయం బయటపడింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ పోస్ట్‌మన్‌గా పనిచేస్తున్న కార్తిక్ సుభాష్‌నగర్ బ్రాంచ్ పరిధి ఉత్తరాలను బట్వాడా చేస్తుంటాడు. అయితే ఆరు నెలలుగా ఈ బ్రాంచ్‌కు వచ్చిన ఉత్తరాలను బట్వాడ చేయకుండా వాటిని తన ఇంట్లోనే ఉంచేశాడు.

ఫిర్యాదులతో వెలుగులోకి..

ఆరు నెలలుగా ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎలాంటి ఉత్తరాలు అందట్లేదు. పార్శిళ్లు రావట్లేదు. దీంతో వారంతా తమకు అందాల్సిన పార్శిళ్ల తేదీలతో సహా హెడ్‌పోస్టాఫీస్‌లో ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఇలా రోజురోజుకూ ఫిర్యాదులు పెరుగుతుండడంతో బ్రాంచ్ పోస్ట్ అధికారులకు ఉత్తరాలు బట్వాడా చేసే కార్తిక్‌పై అనుమానం వచ్చింది. దీంతో అతడిని విచారించగా సరైన సమాధానం రాకపోవడంతో అతడు ఉంటున్న ఇంట్లో తనిఖీ చేయగా 12 సంచుల ఉత్తరాల బ్యాగ్‌లు లభ్యం కావడంతో అధికారులు విస్మయం చెందారు. వెంటనే వీటిని బ్రాంచ్ కార్యాలయానికి తరలించారు. ఇందులో బ్యాంక్ పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు, పాన్‌కార్డులు, వివిధ సంస్థలకు చెందిన ముఖ్యమైన కాగితాల కవర్లు వేలల్లో ఉన్నాయి. దీంతో సదరు పోస్ట్‌మన్‌పై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించినట్లు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజనర్సాగౌడ్ పేర్కొన్నారు. ఉత్తరాలన్నీ స్వాధీనం చేసుకున్నామని, ఆయన ప్రవర్తనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.



పోస్ట్‌మన్ ఇంట్లో ఉన్న ఉత్తరాల బ్యాగులు

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీ



నందిపేటలో విజేత జట్లతో ఖోఖో సంఘం ప్రతినిధులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లి శివారులో మూడు రోజులుగా జరుగుతున్న 42వ రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ బాలబాలికల ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాలు ప్రాతినిధ్యం వహించి క్రీడల్లో పాల్గొన్నారు. ఇందులో బాలుర జట్లలో రంగారెడ్డి (మొదటి), వరంగల్(రెండవ), హైదరాబాద్ (మూడవ), నిజామాబాద్(నాల్గవ) స్థానాలు కైవసం చేసుకున్నాయి. బాలికల జట్లలో హైదరాబాద్(మొదటి), నల్గొండ(రెండవ), రంగారెడ్డి(మూడవ), నిజామాబాద్ (నాల్గవ) స్థానాల్లో నిలిచాయి. రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులు చత్తీస్‌గఢ్‌లో జాతీయ టోర్నీలో పాల్గొంటారని జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి అతిఖుల్లా తెలిపారు. రాష్ట్ర ఖోఖో సంఘం జనరల్ సెక్రటరీ నాతి కృష్ణమూర్తి, రాష్ట్ర ఒలింపిక్ అబ్జర్వర్ లింగన్న, ప్రశాంత్, జిల్లా ఒలింపిక్ అబ్జర్వర్ బొబ్బిలి నర్సయ్య, టోర్నీ కన్వీనర్ సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సుజాత ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే



కామారెడ్డి టౌన్‌: ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంకటరమణారెడ్డి ఎస్పీ సింధూ శర్మను జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీజేపీ కౌన్సిలర్‌ శ్రీకాంత్‌, నాయకులు తేలు శ్రీనివాస్‌, ఆకుల భరత్‌, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫోన్‌లో బెదిరిస్తున్న వారిపై ఫిర్యాదు



బోధన్‌టౌన్‌: అర్ధరాత్రి ఫోన్లు చేసి తనపై బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్‌ బోధన్‌ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌ యాదవ్‌ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శనివారం అర్ధరాత్రి 1 నుంచి తెల్లవారు జాము 4.56 వరకు దొడ్ల రవీందర్‌ రెడ్డి అనే వ్యక్తి ఫోన్‌ చేసి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. అస్లెంబీ ఎన్నికల్లో తాము బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పని చేశామనే కోపంతో తనను చంపేస్తానని బెదిరించినట్లు చెప్పారు. దొడ్ల రవీందర్‌రెడ్డి, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు



రాజంపేట: మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులు భిక్కనూరు పరిధిలోని సిద్ధరామేశ్వర ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో భజనలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భగవన్నామ సంకీర్తనలతో ప్రత్యేక భజనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భజనకు మండలం నుంచే కాకుండా మెదక్‌, కరీంనగర్‌, హైదరాబాద్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వరి నాట్లు ప్రారంభం



నస్రుల్లాబాద్‌: జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు ప్రారంభమయ్యాయి. మండల శివారులో రైతులు వరినాట్లను ప్రారంభించారు. ముందస్తు వరి నాట్లు వేస్తే పంట దిగుబడి పెరగడం, పెట్టుబడి తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా పంట చివరన వచ్చే అకాల వర్షాలతో పంట నష్టం జరగదని అన్నారు.

పట్టాలు అందేనా..?

- పోడు భూముల కోసం మూడు తరాలుగా పోరాడుతున్న రైతులు
- 412 ఎకరాల్లో ఏళ్లుగా సాగుచేస్తున్న వైనం
- కొత్త సర్కార్‌పైనే రైతుల ఆశలు



రామారెడ్డి: ముత్తాతలు బావులు తవ్వి రాట్లతో.. తాతలు బావుల నుంచి గిరిటా తెంపుతో.. కొడుకులు బోరు బావులతో మూడు తరాలుగా సింగరాయపల్లిలోని రైతులు ప్రభుత్వ భూమిలో పంటలు పండిస్తూ జీవిస్తున్నారు. గ్రామానికి చెందిన 382 ఎకరాల ప్రభుత్వ భూమిలో 200 కుటుంబాలు పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాయి. దీనికి తోడు ఇసాయిపేట శివారులోని సర్వే నంబర్‌ 414లో మరో 30 ఎకరాలలో సాగుచేసుకుంటున్న రైతులకు అటవీశాఖ నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వే నంబర్‌ 29లో 382 ఎకరాలకు రెవెన్యూ అధికారులు వారసత్వ సంపదగా వచ్చాయని సర్టిఫికెట్‌ కూడా ఇచ్చారు. 29 సర్వే నంబర్‌కు సంబంధించి గత బీఆర్‌ఎస్‌ సర్కార్‌ ఇచ్చిన డిజిటల్‌ పాస్‌ పుస్తకం, మూడుసార్లు రైతుబంధుతో పాటు, రైతు బీమా, సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు రైతులకు అందాయి. ఇలా మూడు తరాలుగా సాఫీగా సాగుతున్న సింగరాయపల్లి గ్రామంలోని 170 కుటుంబాల రైతుల బతుకుల్లో రెవెన్యూ శాఖ బాంబు పేల్చింది. అప్పటి నుంచి వారిని వెంటాడుతున్నాయి. ఇక 414 సర్వే నంబర్‌లో ఏళ్లుగా 30 ఎకరాల సాగు భూమి ఇసాయిపేట శివారులోని సింగరాయపల్లి రైతులు సాగు చేసుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారుల తీరుతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామంలో 29 సర్వే నంబర్‌లో 382 ఎకరాల భూమి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోనూ, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనూ డిజిటల్‌ పాస్‌ పుస్తకాలను రైతులకు అందజేశారు.

ఈ సర్వే నంబర్‌లోని 382 ఎకరాలలో ఎక్కువగా బావులున్నాయి. బావుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు వరి సాగు చేస్తున్నారు. కానీ 2017లో ఈ భూమి ఫారెస్ట్‌ భూమి కాగితాలుగా మారాయి. ఇక 414 సర్వేలోని 30 ఎకరాల సాగు భూమి ఇసాయిపేట శివారులో సింగరాయపల్లి గ్రామానికి చెందిన 60 కుటుంబానికి ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 414 సర్వే నంబర్‌కు పట్టాలిచ్చిన నాటి సర్కార్‌ తెలంగాణలో డిజిటల్‌ పట్టాలివ్వకపోవడంతో పాటు అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

ఆ భూమి ఊరికి జీవనాధారం..

సింగరాయపల్లి గ్రామంలో 371 కుటుంబాలు ఉండగా 1308 జనాభా ఉంది. సర్వే నంబర్‌ 29లోని 382 ఎకరాలలో వ్యవసాయమే ఊరిలోని 70 శాతం జనాభాకు జీవనాధారం. ప్రస్తుతం 382 ఎకరాలలో 170 కుటుంబాలు వ్యవసాయం చేస్తూ బతుకు బండి లాగుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త ఇచ్చిన పాటాపాస్‌ పుస్తకం ఉన్న అర్హత కల్గిన ఐదుగురు రైతులు చనిపోయిన రైతుబీమా వర్తించలేదు. పంటల నమోదు కూడా వ్యవసాయాధికారులు చేయడం లేదు.

దీంతో ఆ భూములో పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవడం సాధ్యం కావడం లేదు. తప్పని సారి పరిస్థితుల్లో ధా న్యాన్ని దళారులకే విక్రయిస్తున్న నష్టపోతున్నారు.

కొత్త సర్కార్‌పై గంపెడు ఆశలు..

పోడు సమస్యను కాంగ్రెస్‌ సర్కార్‌ పరిష్కరిస్తుందని సింగరాయపల్లి రైతులు ఆశగా ఉన్నారు. పోడు సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల వేళ హామి ఇవ్వడం ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో తమ సమస్య పరిష్కారమవుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

రైతు బీమా రాలేదు



గత ప్రభుత్వం కొత్త పాస్‌ పుస్తకం ఇచ్చింది. మూడు సార్లు రైతుబంధు డబ్బులు ఇచ్చారు. కానీ భర్త నర్సింహులు పేరు మీద సర్వే నంబర్‌ 29లో భూమి ఉంది. రైతు బీమాకు అర్హత ఉన్నా భూములను తొలగించామని ఇవ్వలేదు. కాంగ్రెస్‌ సర్కార్‌ పట్టాలివ్వాలి. – ఎల్లవ్వ, రైతు, సింగరాయపల్లి

ప్రభుత్వం అంగీకరిస్తేనే..

- ఫిబ్రవరి 1కి ముగియనున్న సర్పంచుల పదవి కాలం

మోర్తాడ్‌: పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సంసిద్ధతను వ్యక్తం చేసినా ప్రభుత్వం అంగీకారం తెలిపితే స్థానిక నగార మోగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫిబ్రవరి 1కి సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పదవి కాలం ముగియనుంది. పాలకవర్గాల పదవి కాలం ముగియక ముందే ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని ఎన్నికల సంఘానికి కోర్టు గతంలోనే సూచించింది. హైకోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తును ప్రారంభించింది. ఓటర్ల సంఖ్య ఆధారంగా ప్రిసైడింగ్‌ అధికారులు, పోలింగ్‌ సిబ్బందిని ఎంపిక చేసి వారి వివరాలను అందించాలని ఎన్నికల సంఘం పంచాయతీ అధికారులను ఆదేశించింది. ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలతో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయని గ్రామాల్లో విస్తృతమైన ప్రచారం జరిగింది. పోటీకి ఉత్సాహం చూపుతున్న నాయకులు ఎవరికి వారే తమ మద్దతుదారులతో సంప్రదింపులను షురూ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం కొలువుదీరగా స్థానిక ఎన్నికల నిర్వహణకు రేవంత్‌రెడ్డి సర్కార్‌ ఆసక్తి చూపుతుందా లేదా అనే సందేహం వ్యక్తం అవుతుంది. సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడం, అసెంబ్లీ సమావేశాలు ఆరంభం కావడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చర్యలు తీసుకోవడం పలు కార్యక్రమాల్లో ప్రభుత్వ పెద్దలు బిజీ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీల ఎన్నికలు నిర్వహిస్తారో వేచి చూడాల్సిందే.నిజామాబాద్‌లో 530, కామారెడ్డిలో 526 జీపీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల పదవి కాలం ముగిసిపోనుండగా షెడ్యూల్‌ ప్రకారం జనవరిలో ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. సమయానుకూలంగా ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.



అవినీతి రహితంగా మార్చడమే లక్ష్యం



ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదాం
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

దోమకొండ: అవినీతి రహిత నియోజకవర్గంగా కామారెడ్డిని తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్‌) పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఆదివారం దోమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.5 లక్ష లు ఉన్న రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్య, వైద్యానికి తాను ప్రాధాన్యత ఇస్తానన్నారు. 108 అంబులెన్స్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచి నిత్యం సేవలు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీలకతీతంగా పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదామని వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలు తమ సమస్యలపై తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. తన సొంత మేనిఫెస్టోను త్వరలోనే అమలు చేస్తానన్నారు. అంతకు ముందు బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్‌, సర్పంచ్‌ అంజలి, ఎంపీటీసీ సదానంద, సింగిల్‌ విండో చైర్మ న్‌ నాగరాజురెడ్డి, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌, డీఆర్‌డీవో సాయన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సంగీత్‌కుమార్‌, తహసీల్దార్‌ సంజయ్‌రావు, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, కోఆప్షన్‌ మెంబర్‌ షమీ, బీజేపీ నాయకులు రాజేష్‌, భూపాల్‌ రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ విజేతలకు బహుమతులు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌ నాగారం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ గ్రౌండ్‌లో మాస్టర్‌ అథ్లెటిక్స్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. నేషనల్‌ మాస్టర్‌ అథ్లెటిక్‌ అసోసియేషన్‌ నిజామాబాద్‌ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 5కె రన్‌, వాకింగ్‌, లాంగ్‌ జంప్‌, షాట్‌పుట్‌, జావలింగ్‌ త్రో 100 మీటర్‌ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. అనంతరం విజేతలకు ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి మెడల్స్‌, సర్టిఫికెట్స్‌ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ శ్రీను నాయక్‌,అధ్యక్షుడు, బి గోపీరెడ్డి, కేవీ కిరణ్‌కుమార్‌, నీతా రెడ్డి, దశరథ్‌ రేఖారాణి, శ్రీనివాస్‌ సంగీతరావు, ఉమామహేశ్వర్రెడ్డి, శివ, ఇందిరా దినేశ్‌, గోపీ మహేశ్‌, రఘువీర్‌ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

రుద్రూర్‌: పోతంగల్‌ మండలంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో 2004–05లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ స మ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసు కొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ



పడి పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు



పూజకు హాజరైన భక్తులు

జక్రాన్‌పల్లి: పడకల్‌ గ్రామంలో అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప సేవా సమితి, గ్రామ కమిటీ సహకారంతో రమణ గురు స్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. పడిపూజకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గురుస్వాములు నర్సారెడ్డి, లోక తిరుపతి, లింగం, నితిన్‌, పుప్పాల శ్రీనివాస్‌, ప్రసాద్‌, సత్య, గుర్క సతీశ్‌, చందు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం కొత్తపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ముప్కాల్‌ ఎస్సై భాస్కరాచారి ఆదివారం తెలిపారు. పొలంలో మృతదేహం ఉందన్న సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. నెల రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, ఎవరైనా హత్య చేసి ఈ ప్రాంతంలో పడేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు రోజుల్లో రెండు మృతదేహాలు..

ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో మూడు రోజుల్లో రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. గత శుక్రవారం మెండోరా మండలం దూదిగాం శివారులోని గోదావరిలో 15 ఏళ్ల బాలిక మృతదేహం, ఆదివారం కొత్తపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల క్రితం ముప్కాల్‌ మండలం వేంపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు హత్య చేసి తగులబెట్టారు. ఇప్పటికీ ఆ కేసు చేధించలేదు. మూడు రోజుల వ్యవధిలో రెండు గుర్తు తెలియని మృతదేహాలు ఉమ్మడి బాల్కొండలో లభ్యం కావడంతో పోలీసుల పనితీరుకు అద్దం పడుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటికలో బోరుబావి ధ్వంసం



బాన్సువాడ రూరల్‌: మండలంలోని బోర్లంలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో గుర్తుతెలియని వ్యక్తులు బోరుబావి ని ధ్వంసం చేశారు. కేసింగ్‌ పైప్‌ను సైతం పగులగొట్టారు. శ్మశానవాటికలో నీటిసౌకర్యం కల్పించాలని గతేడాది ముస్లింల కోరిక మేరకు ఎంపీటీసీ శ్రావణీదేవేందర్‌రెడ్డి బోరుబావి తవ్వకం పనులు చేపట్టి మోటర్‌ బిగించారు. అధికారులు స్పందించి బోరుబావిని ధ్వంసం చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి డ్రైవర్‌ మృతి



తుకారాం మృతదేహం



బోల్తాపడ్డ ట్రాక్టర్‌

కమ్మర్‌పల్లి: వ్యవసాయ పనులు చేస్తూ ట్రాక్టర్‌ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌ మృతి చెందిన ఘటన మండలంలోని చౌట్‌పల్లిలో చోటుచేసుకుంది.ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా నయాగావ్‌ తాలుక అంతర్గావ్‌కు చెందిన తుకారాం హన్మత్‌ ఇబ్జిత్వర్‌(40) ఉపాధి నిమిత్తం ఐదేళ్ల క్రితం చౌట్‌పల్లికి వచ్చాడు. ట్రాక్టర్‌ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఓ వ్యవసాయ క్షేత్రంలో వరి పంట వేయడానికి అనుగుణంగా పొలంలో ట్రాక్టర్‌తో రోటవేటర్‌ చేస్తుండగా, ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌ నడుపుతున్న ఇబ్జిత్వర్‌ ట్రాక్టర్‌ కింద పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సరంపల్లిలో ఒకరి అదృశ్యం

కామారెడ్డి రూరల్‌: మున్సిపల్‌ పరిధిలోని సరంపల్లి గ్రామానికి చెందిన గైనబోయిన అంజయ్య అ దృశ్యమైనట్లు కౌన్సిలర్‌ ఆకుల రూప రవికుమార్‌ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 19న ఇంటి నుంచి వెళ్లి అంజ య్య తిరిగి రాలేదన్నారు. పలు చోట్ల వెతికినా ఫలితం లేదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అంజయ్య భార్య సావిత్రి తెలిపారు.

గుర్తు తెలియని బైక్‌ లభ్యం



వేల్పూర్‌: వేల్పూర్‌ అడ్రస్‌పై ఉన్న పల్సర్‌బైక్‌ డిచ్‌పల్లి పోలీసులకు దొరికిందని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తెలపాలని వేల్పూర్‌ ఎస్సై వినయ్‌కుమార్‌ ఆదివారం తెలిపారు. బైక్‌ వేల్పూర్‌ అడ్రస్‌పై ఉన్నప్పటికీ ఆ అడ్రస్‌లో ఉన్న వ్యక్తు లు వేల్పూర్‌లో లేరని పేర్కొన్నారు. మండలంలో ఈ బైక్‌కు సంబంధించిన వ్యక్తులు ఉంటే 8712659862 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు.

వేల్పూర్‌ వీడీసీకి నోటీసులు..!

ఖలీల్‌వాడి: వేల్పూర్‌ మండల కేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తా వద్ద ఓ భూమిలో మట్టి కుప్పలు తీయాలని చెప్పినా వినకపోవడంతో గ్రామంలోని ఓ సంఘం సభ్యులను వీడీసీ బహిష్కరించింది. దీంతో పోలీసులు వీడీసీకి నోటీసులు అందించినట్లు తెలిసింది. గ్రామంలో చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని, న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమస్యను పరిష్కారించుకోవాలని నోటీసులో సూచించారు.

లింగంపేటలో చోరీ

లింగంపేట: మండ ల కేంద్రంలోని మ త్తడికిందిపల్లెలో శనివారం రాత్రి చో రీ జరిగినట్లు ఏఎ స్సై ప్రకాశ్‌ ఆదివా రం తెలిపారు. గ్రా మానికి చెందిన ప ద్మా నర్సింహులు కుటుంబ సభ్యుల తో కలిసి శనివారం ఉదయం వ్యవసాయ పనుల ని మిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లగా సాయంత్రం తిరి గి వచ్చారు. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, రూ. 20 వేలు నగదు, 20 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై ప్రకాశ్‌, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఘటన స్థలాన్ని సందర్శించి క్లూస్‌ టీం బృందంతో వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆటో ఖాళీ – బస్సు ఫుల్‌

తాడ్వాయి: కాంగ్రెస్‌ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'మహాలక్ష్మి' పథకంతో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న వారి ఆశలపై నీళ్లచల్లినట్లయింది. పథకం అమలు కాక ముందు మండలం నుంచి గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఆటోల్లోనే వెళ్తుండేవారు. కానీ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో బస్సు రాకున్నా వాటి కోసమే ప్రయాణికులు ఎదురుచూస్తూ అధిక సంఖ్యలో వెళ్తున్నారు. ప్రభు త్వం తమ ఉపాధిపై నీళ్ల చల్లిందని తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.



తాడ్వాయిలో బస్సు ఎక్కుతున్న మహిళలు